జాతీయస్థాయి హాకీ పోటీలకు జిల్లా క్రీడాకారులు

జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపికైన జిల్లాకు చెందిన క్రీడాకారులు

నల్లగొండ రూరల్, నవంబర్ 17 : ఈ నెల 7 నుంచి సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగిన 68వ స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో ఉత్తమ ప్రదర్శన కనబర్చిన ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన టి.జస్వంత్, జె.వినయ్, ఎండీ.మాజెలు జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు నల్లగొండ ఎస్‌జీఏఫ్ సెక్రటరీ దగ్గుపాటి విమల శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జస్వంత్, వినయ్ నల్లగొండలోని ప్రతీక్‌రెడ్డి జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతుండగా, ఎండీ. మోజె వలిగొండలోని వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 21 నుంచి 27 వరకు హర్యానా రాష్ట్రం రోహతక్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలలో వీరు తెలంగాణ జట్టు తరఫున పాల్గొంటారని తెలిపారు. కోచ్ యావర్ పర్యవేక్షణలో నిత్యం సాధన చేయడం వల్లే మన క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. జిల్లావాసులు రాష్ట్ర జట్టుకు ఎంపికవడంపై నల్లగొండ హాకీ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కూతురు శ్రీనివాస్‌రెడ్డి, ఇమామ్ కరీం హర్షం వ్యక్తం చేశారు.

ఉచిత వైద్య సేవలు అభినందనీయం

- ఎమ్మెల్యే బాలూనాయక్

వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలూనాయక్

పెద్దఅడిశర్లపల్లి, నవంబర్17 : మూరుమూల తండాల ప్రజలకు డాక్టర్ పాల్వాయి వెంకట్‌రెడ్డి ఉచిత వైద్యసేవలు అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే బాలూనాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని వద్దిపట్ల గ్రామంలో ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరం, రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ ప్రాంతానికి చెందిన వెంకట్‌రెడ్డి మండలంలోని ప్రజలకు తన సొంత ఖర్చుతో వైద్య సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం గ్రామస్తులతో కలిసి డాక్టర్ వెంకట్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. క్యాంపులో 450 మందికి వైద్య పరీక్షలు చేశారు. 25 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తెరా సత్యనారాయణరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ఎల్లయ్య, నాయకులు బొడియానాయక్, సతీశ్‌రెడ్డి, గోవర్దన్‌రెడ్డి, గుర్వయ్య పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

- ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

చొప్పరివారిగూడెంలో గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

చండూరు, నవంబర్ 17: మున్సిపాలిటీలో చేపట్టిన అభివృద్ధి పనులు నాణ్యత పాటించాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. చండూరు పట్టణంలో 1.9 కిలోమీటర్ల మేర నిర్మిస్తున్న రోడ్డు విస్తరణ పనులను ఆదివారం ఎమ్మెల్యే పరిశీలించారు. పనులల్లో నాణ్యత లేకపోతే సహించేది లేదని కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు. మున్సిపాలిటీకి సంబంధించి భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్ తయారు చేయించాలని అధికారులకు సూచించారు. అంతకు ముందు చండూరు మున్సిపల్ కార్యాలయంలో స్త్రీ శక్తి రుణాల ద్వారా ఏర్పాటు చేసిన ఇందిరా మహిళ శక్తి క్యాంటీన్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. చామలపల్లి గ్రామంలో ఎమ్మెల్యే పర్యటించారు. సీతారామచంద్ర స్వామి ఆలయ కళాతోరణ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. చొప్పరివారిగూడెం గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దోటి సుజాతా వెంకన్న, మాజీ సర్పంచులు అబ్బనబోయిన లింగయ్య యాదవ్, చొప్పరి అనూరాధావెంకన్న, ఆంజనేయులు, మల్లేశ్, శ్రీనివాసులు, రవి, కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు కొరివి ఓంకారం, అనంత చంద్రశేఖర్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

మిర్యాలగూడ రూరల్ : పేదింటి ఆడబిడ్డ పెండ్లికి ఆర్థిక సాయం అందిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మిర్యాలగూడ రూరల్,నవంబర్17 : మండలంలోని ముల్కలకాల్వ గ్రామానికి చెందిన పేద కుటుంబానికి చెందిన ఎర్రబోయిన సైదులు కూతురు జ్యోత్స్న వివాహానికి బీఆర్‌ఎస్ నాయకులు ఆర్థిక సాయం అందించారు. ఎన్‌బీఆర్ ఫౌండేషన్ చైర్మన్ నల్లమోతు సిద్ధార్థ రూ.10 వేలు, రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి రూ.5 వేలు పంపించగా ఆదివారం గ్రామ మాజీ సర్పంచ్ బోగబోయిన రాజు కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు సకినాల హరి ప్రసాద్, పార్టీ నాయకులు పోతుగంటి రాధాకృష్ణమూర్తి, షేక్ హన్ను పాల్గొన్నారు.

మర్రిగూడ : మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు రాచకొండ యాదయ్య శనివారం గుండెపోటుతో మృతి చెందాడు. యాదయ్య మారుతి రెడీమిక్స్‌లో డ్రైవర్‌గా పని చేస్తుండడంతో దాని యజమాని దేవులపల్లి నరేందర్‌రెడ్డి రూ.10వేల ఆర్థిక సాయం అందించారు.

24న టీఎస్‌యూటీఎఫ్ జిల్లా మహాసభలు

నార్కట్‌పల్లి, నవంబర్17 : ఈ నెల 24న మండల కేంద్రంలో జరిగే టీఎస్ యూటీఎఫ్ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు ఎడ్ల సైదులు, ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశం కోరారు. ఆదివారం మండల కేంద్రంలో మహాసభల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాసభలకు 33 మండల, పట్టణ శాఖల నాయకులు, ప్రతినిధులు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు. మహాసభల్లో విద్యారంగ అభివృద్ధి గురించి చర్చించి పలు తీర్మానాలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

WANTED
★ హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899 / 9640468899.
NT-338958-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం...
మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.
నల్లగొండ : 9182777626 | నల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059 | సూర్యాపేట : 9182777630 | భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059 | కోదాడ : 9182777630 | చౌటుప్పల్ : 9182777638

కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు నిల్

- తాగునీరు, నీడ లేక రైతుల అవస్థలు
- వడ్లు పోసుకునేందుకు స్థలం కూడా కరువే

త్రిపురారం : కొనుగోలు కేంద్రంలో స్థలం లేక వడ్ల కుప్పలు కలిసిపోయేలా పోసిన రైతులు

త్రిపురారం, నవంబర్ 17: రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. వాటిల్లో కనీస సౌకర్యాలు కల్పించక పోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 11 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినప్పటికీ ఏ ఒక్క కేంద్రంలోనూ వసతులు కల్పించలేదు. కేవలం బ్యానర్ కట్టి వదిలేశారు. ధాన్యం పోసేందుకు కనీసం స్థలం లేక, పోసినా కొనుగోలు చేసే దిక్కులేక మిల్లుల వద్దకే ధాన్యాన్ని తీసుకెళ్తున్నామని రైతులు చెబుతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కరెంట్, మంచినీరు, పట్టాల వసతి ఏర్పాటు చేయాల్సి ఉండగా అవేవీ లేవు. కనీసం వడ్లు పోసేందుకు కూడా స్థలం లేక ఒకరి వడ్లపై మరొకరు పోయడం వల్ల గొడవలు జరుగుతున్నాయని రైతులు చెబుతున్నారు.

రైతులే శుభ్రం చేసుకోవాలి

త్రిపురారంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. అయితే కేంద్రంలో కనీసం వడ్లు పోసుకోవడానికి కూడా స్థలం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రంలో వడ్లు పోయాలంటే ముందుగా రైతు వెళ్లి అక్కడ స్థలాన్ని సొంత ఖర్చుతో శుభ్రం చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కొంతమంది రైతులు కూలీలను పెట్టి పిచ్చి మొక్కలను తొలగించడం, పట్టాలు వేసుకోవడం వంటివి చేయిన తర్వాత వడ్లు తెచ్చి పోస్తున్నారు. మరి కొందరు డోజర్‌తో స్థలం శుభ్రం చేయించుకుంటున్నారు. దాంతో తమపై అధిక భారం పడుతుందని రైతులు ఆదేవన వ్యక్తం చేస్తున్నారు. కేంద్రంలో కరెంట్, మంచినీటి సౌకర్యం కూడా కల్పించలేదని తెలిపారు.

త్రిపురారం ధాన్యం కొనుగోలు కేంద్రంలో వడ్లు పోసుకునేందుకు స్థలం శుభ్రం చేసుకుంటున్న రైతు

కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించాలి

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించాలి. రైతులు పోసిన ధాన్యాన్ని వెంటనే కాంటా వేయించాలి. కనీసం పోసిన ధాన్యం రాసుకునేందుకు కూడా ఎవరూ రావడం లేదు. రోజుల తరబడి అక్కడే ఎదురు చూస్తున్నా కాంటా వేస్తలేరు. విసుగు చెంది రైతులు మిల్లుల వద్దకు వెళ్తున్నారు. అధికారులు స్పందించి త్వరగా వడ్లు కొనాలి.

- అనుముల శ్యాంసుందర్‌రెడ్డి, రైతు, త్రిపురారం

అంజన్‌రావుకు పలువురి నివాళి

అంజన్‌రావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పల్లె రవికుమార్‌గౌడ్

మర్రిగూడ, నవంబర్ 31 : మండల కేంద్రానికి చెందిన దివంగత నాటు వైద్యుడు పానుగోటి అంజన్‌రావు దశదిన కర్మ ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొని అంజన్‌రావు చిత్రపటానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో కల్లు గీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్ , మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర నాయకుడు ఉజ్జిని రత్నాకర్‌రావు, జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, మండల కార్యదర్శి భిక్షంరెడ్డి, సహాయ కార్యదర్శి బూడిద సురేశ్, మాజీ ఎంపీపీ అనంతరాజుగౌడ్, మాజీ సర్పంచులు నల్ల యాదయ్య, చెర్కు లింగం గౌడ్, లక్ష్మీనర్సింహ, పందుల రాములు గౌడ్

25న వల్లాలలో మహా పడి పూజ

పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపేందర్‌గౌడ్, అర్చకులు

శాలిగౌరారం, నవంబర్17 : మండలంలోని వల్లాల గ్రామంలో పార్వతీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాస ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 25న మహాపడి పూజ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను ఆదివారం గ్రామంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భూపతి ఉపేందర్‌గౌడ్ మాట్లాడుతూ మహాపడిపూజ కార్యక్రమానికి మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ హాజరుకానున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త వావిలాల రామలింగయ్యశర్మ, శివస్వాములు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో దొంగతనాలను అరికట్టవచ్చు

- ఎస్‌ఐ యాదయ్య

చాకలిశేరిపల్లిలో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎస్‌ఐ యాదయ్య

మాల్, నవంబర్ 17 : గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల నేరాలు, దొంగతనాలను అరికట్టవచ్చని చింతపల్లి ఎస్‌ఐ బి.యాదయ్య అన్నారు. ఆదివారం మండలంలోని చాకలిశేరిపల్లి గ్రామస్తులు రూ.2 లక్షలతో ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొలగోని మల్లమ్మా జంగయ్యగౌడ్, కేశగోని వెంకటేశ్‌గౌడ్, బొలగోని బుచ్చయ్యగౌడ్, పుప్పాల బాలయ్య, మాచర్ల శ్రీశైలం, శ్రీను, చిన్న రాములు, అహ్మద్ ఖాన్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వీర బ్రహ్మేంద్రస్వామి నాటక ప్రదర్శన

నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

రామగిరి, నవంబర్ 17: మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్ర నాటక ప్రదర్శనను సురభి నాటక సమితి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నల్లగొండలోని విశ్వకర్మ భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణ సేవా సంస్థ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాసోజు శ్రీనివాస్, పెండోట సోము మాట్లాడుతూ అంతరించిపోతున్న నాటక కళను సజీవంగా ఉంచడంలో సురభి వారు చేస్తున్న కృషిని అభినందించారు. కళలు, కళాకారులను ప్రతి ఒక్కరూ ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సేవా సంస్థ వివాహ పరిచయ వేదిక కన్వీనర్ పగిడిమర్రి వెంకటాచారి, జిల్లా గౌరవాధ్యక్షుడు కొండోజు కృష్ణమాచారి, పర్వతం నరేంద్రబాబు, నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్-3 పరీక్షలు

మిర్యాలగూడలో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న సబ్‌కలెక్టర్

నల్లగొండలోని ఎన్‌జీ కళాశాల పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థులు

నల్లగొండ జిల్లా కేంద్రంతో పాటు మిర్యాలగూడ పట్టణం, మండలంలో గ్రూప్-3 పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. ఆదివారం పేపర్-1,2 పరీక్షలు జరుగగా సోమవారం పేపర్-3 పరీక్ష జరుగనున్నది. నల్లగొండలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, మిర్యాలగూడ పట్టణంలోని పలు పరీక్ష కేంద్రాలను సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ తనిఖీ చేశారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని, అభ్యర్థులకు మౌలిక సౌకర్యాలు కల్పించాలని సూచించారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

మిర్యాలగూడ రూరల్, నవంబర్17 : రోడ్డు ప్రమాదంతో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు రూరల్ ఎస్‌ఐ పిల్లి లోకేశ్ తెలిపారు. మండలంలోని కొత్తపేటకు చెందిన గౌరి యాదగిరి (59) శనివారం తన బైక్‌పై మిర్యాలగూడకు వెళ్తుండగా కిష్టాపురం వద్ద బైక్ అదుపుతప్పి కింద పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు చికిత్స నిమిత్తం మిర్యాలగూడ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. యాదగిరి కుమారుడు జనార్దన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

వ్యక్తిపై దాడి చేసిన ఇద్దరికి రిమాండ్

గుర్రంపోడ్, నవంబర్ 17: మద్యం మత్తులో వ్యక్తిపై దాడి చేసిన ఇద్దరిని రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ పసుపులేటి మధు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 15 రాత్రి మండలంలోని కొప్పోలు గ్రామ బస్టాండ్ వద్ద గ్రామానికి చెందిన కొత్ర సాయి, ఈర్ల నరేశ్ మద్యం మత్తులో అదే గ్రామానికి చెందిన బుషిపాక నవీన్‌పై బీరు సీసాతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. నవీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

19న సీపీఎం మండల మహాసభ

కట్టంగూర్, నవంబర్ 17 : మండలంలోని ఇస్మాయిల్‌పల్లి గ్రామంలో ఈ నెల 19న సీపీఎం మండల మహాసభ నిర్వహించనున్నట్లు పార్టీ మండల కార్యదర్శి పెంజర్ల సైదులు తెలిపారు. ఆదివారం మహాసభ నిర్వహించే స్థలాన్ని పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 200 మంది ప్రతినిధులు హాజరవుతున్నారని, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆయన వెంట నాయకులు మాద సైదులు, పెంజర్ల కృష్ణ, జాల ఆంజనేయులు, చిలుకూరి సైదులు, యన్నమల్ల ప్రవీణ్, గోపిరెడ్డి, సందీప్‌రెడ్డి, శ్రీను, నర్సింహ్మా పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో హోమాలు

నకిరేకల్, నవంబర్ 17 : నకిరేకల్ పట్టణంలోని డాక్టర్స్ కాలనీలో నిర్మించిన వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో నిర్వహిస్తున్న అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు కొనసాగుతున్నాయి. అందులో భాగంగా ఆదివారం వాస్తుపూజ, వాస్తు హోమం నిర్వహించారు. భక్తులు ఉదయమే దేవాలయానికి వచ్చి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వాసవీ మహా పీఠాధిపతి శ్రీధర్ స్వామిజీ, ఆలయ కమిటీ ప్రతినిధులు గర్రె రామమూర్తి, బ్రహ్మదేవర లక్ష్మయ్య, బ్రహ్మదేవర పద్మావతి, వీర్లపాటి రాంబాబు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ జానయ్య, ఆర్యవైశ్య సంఘం నాయకులు బ్రహ్మదేవర రమేశ్, రామ్మోహన్, నర్సింహారావు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో పూజలు

డిండి, నవంబర్ 17 : మండల కేంద్రంలోని షిర్డీసాయి ఆలయ దశమ వార్షికోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. రెండు రోజులపాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు నగర సంకీర్తన, కాగడహారతి, అభిషేకం, సంస్థాన్ హారతి, మంటపారాధన, గణపతి పూజ, లక్ష్మీగణపతి, సకల దేవత హోమం, లక్షపుష్పార్చన, సహస్ర దీపాలంకరణ, అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా చేపట్టిన భజన, కోలాట ప్రదర్శన ఆకట్టుకున్నాయి.

ముడుపులు తగులబెట్టిన వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు

నీలగిరి, నవంబర్ 17 : జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డు ప్రాంత గుట్టపై ఉన్న కనకదుర్గ ఆలయంలో భక్తులు కట్టిన ముడుపులను హరినాయక్ అనే వ్యక్తి తగుల బెట్టాడని, అతడిపై చర్యలు తీసుకోవాలనికోరుతూ పలువురు భక్తులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో సైదులుగౌడ్, నరసింహారెడ్డి, రామకృష్ణ ఉన్నారు.

సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్సీ కోటిరెడ్డి

సీఎం సహాయనిధి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

మిర్యాలగూడ, నవంబర్ 17: సీఎం సహాయనిధిని అర్హులైన పేదలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ ఎంసీ. కోటిరెడ్డి సూచించారు. మిర్యాలగూడ నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన 12 మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.3,25,500 చెక్కులను ఆదివారం పట్టణంలోని తన కార్యాలయంలో అందించారు. ఆపదలో ఉన్న పేదలకు సీఎం సహాయనిధి వరంలాంటిదన్నారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ లలితా హతీరాంనాయక్, నాయకులు తిరుమలగిరి వజ్రం, భీమ్లానాయక్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

- డీఆర్డీఓ శేఖర్‌రెడ్డి

కోయగూరోనిబావి కొనుగోలు కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న డీఆర్డీఓ శేఖర్‌రెడ్డి

గుర్రంపోడ్, నవంబర్ 17: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రికార్డులను సక్రమంగా నిర్వహించాలని డీఆర్డీఓ శేఖర్‌రెడ్డి సూచించారు. ఆదివారం మండలంలోని కోయగూరోనిబావి, చామలోనిబావిలో గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన తనిఖీచేశారు. ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా కేంద్రాల్లో కనీస వసతులు కల్పించాలని కేంద్రం నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట ఏపీఎం ఊరుపక్క యాదయ్య, సీసీ తంగెళ్ల శంకరయ్య, కేంద్రాల నిర్వాహకులు ఉన్నారు.

గురుకులాలకు పక్కా భవనాలు నిర్మించాలి

- మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు వీరస్వామి

గురుకుల వసతిగృహంలో భోజనాన్ని పరిశీలిస్తున్న మానవ హక్కుల వేదిక నాయకులు

కట్టంగూర్, నవంబర్ 17 : మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల బీసీ గురుకులానికి పక్కా భవనం నిర్మించాలని మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు అక్కెనపల్లి వీరస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని కమ్మగూడెంలో ఉన్న బాలికల వసతి గృహాన్ని ఆయన సందర్శించారు. విద్యార్థినులు, ఉపాధ్యాయులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాలుగు గదులలో 379 మంది విద్యార్థినులను ఉంచడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పాఠశాల ప్రారంభమై ఆరునెలలు గడుస్తున్నా విద్యార్లుకు దుప్పట్లు, బెడ్లు ఇవ్వలేదన్నారు. వంట గది అపరిశుభ్రంగా ఇరుకుగా ఉందని, భవనానికి ప్రహరీ లేకపోవడంతో విద్యార్థినులు భయాందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఆయన వెంట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అద్దంకి దశరథ, జిల్లా ఉపాధ్యక్షుడు చింతపల్లి గురువయ్య, జిల్లా సహాయ కార్యదర్శి చెట్టిపల్లి కాశీరాం, మహ్మద్, గడ్డం వెంకటరమణ, ఫయాజ్ ఉన్నారు.

కాంటా వేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి

- డీసీఓ వెంకటేశ్వర్లు

చిట్యాలలో రైతులతో మాట్లాడుతున్న డీసీఓ వెంకటేశ్వర్లు

చిట్యాల, నవంబర్ 17 : కొనుగోలు కేంద్రాలలో కాంటా వేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని డీసీఓ వి.వెంకటేశ్వర్లు కేంద్రం నిర్వాహకులను ఆదేశించారు. ఆదివారం చిట్యాల, పిట్టంపల్లి గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. కొనుగోళ్లు సజావుగా సాగేలా చూడాలని సూచించారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తున్న లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ ప్రతినిధులు

నకిరేకల్, నవంబర్ 17 : నకిరేకల్ పట్టణానికి చెందిన పట్టూరి మహేశ్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. చికిత్స కోసం రూ.6 లక్షలు ఖర్చు కాగా కుటుంబ సభ్యులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ ప్రతినిధులు ఆదివారం మహేశ్‌కు రూ.10,200 ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధి బ్రహ్మదేవర నరేశ్ మాట్లాడుతూ 265 మంది స్నేహితులు వాట్సప్ గ్రూపును ఏర్పాటు చేసుకొని ప్రతి నెలా రూ.200 చొప్పున జమచేసి పేదలకు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు బ్రహ్మదేవర నరేశ్, సింగారపు మారుతి, విక్రమ్, సంతోశ్, రమేశ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

పోటీలో పాల్గొన్న విద్యార్థులు

రామగిరి, నవంబర్ 17: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. 20 మంది విద్యార్థులు పాల్గొనగా.. విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ అధికారులు కట్టా నాగయ్య, శ్రీనివాస్, రాకేశ్ పాల్గొన్నారు.

గోపలాయపల్లిలో ఘనంగా సుదర్శన హోమం

హోమం నిర్వహిస్తున్న అర్చకులు

నార్కట్‌పల్లి, నవంబర్ 17 : మండలంలోని గోపలాయపల్లి గుట్టపై ఆదివారం రోహిణీ నక్షత్రాన్ని పురస్కరించుకొని అర్చకులు సుదర్శన హోమాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు హోమంలో పాల్గొన్నారు. ఆలయ అనువంశిక చైర్మన్ కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి భక్తులకు వసతులు కల్పించారు.

చెర్వుగట్టులో భక్తులపై తేనెటీగల దాడి

నార్కట్‌పల్లి, నవంబర్ 17 : మండలంలోని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని మూడు గుండ్లపైకి వెళ్లిన భక్తులపై ఆదివారం తేనెటీగలు దాడి చేశాయి. గుట్టపైన వసతి గదుల ఆవరణలో భక్తులు అమ్మవారికి బోనం సమర్పించేందుకు నైవేద్యం వండుతుండగా వెలువడిన దట్టమైన పొగ మూడు గుండ్ల వైపు వెళ్లింది. ఆ పొగకు రాళ్లమధ్య ఉన్న తేనెటీగలు ఒక్కసారిగా లేచి మూడుగుండ్లపై ఉన్న భక్తుల పై దాడి చేశాయి. గమనించిన భక్తులు వెంటనే కిందికి దిగడంతో ఎవరికీ హాని జరుగలేదు.